సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ధర.. గుండె దడ

కాయగూరల ధరలు కొండెక్కాయి. ఏది కొందామన్నా కిలో రూ.50కి తక్కువ లేవు. దీంతో సామాన్యుడు పచ్చడి మెతుకులతో కడుపు నింపుకుంటున్నాడు. 8లో



ఓ గొర్రె.. 45 కిలోమీటర్లు

ఓ గొర్రెను అపహరించిన వారు దాన్ని కారులో వేసుకుని వెళ్లిపోగా.. గొర్రెల కాపరులు ఏకంగా 45 కి.మీ వెంబడించి మరీ పట్టుకున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
27.6°/21.9°

జిల్లాలో సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ : కలెక్టర్



బందోబస్తును పరిశీలిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని మద్యం షాపుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 87 దుకాణాలకు 1,465 దరఖాస్తులు అందగా, సోమవారం స్థానిక సాయిఆరామంలో దుకాణాల ఎంపిక కోసం లాటరీ తీశారు. కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 87 దుకాణాలకు ఈ నెల 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. మొత్తంగా 1,465 మంది దరఖాస్తు చేసుకోగా, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు పూర్తి చేశామన్నారు. లాటరీలో దుకాణాలను దక్కించుకున్నవారు మొదటి సంవత్సరం లైసెన్స్ ఫీజు 10 శాతం డిపాజిట్ 48 గంటల్లో చెల్లించాలన్నారు. ఇందుకోసం బ్యాంకర్ల సహకారంతో లాటరీ ప్రాంగణంలోనే చలానా తీసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 16 తేదీ నుంచి నూతన మద్యం పాలసీ విధానం అమల్లోకి వస్తుందని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ సువర్ణ, డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ మునిస్వామి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

మద్యం దుకాణాల కేటాయింపు కోసం లాటరీ నిర్వహించిన సాయిఆరామం ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని తలపించింది. ఎస్పీ రత్న ఏకంగా 300 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన లాటరీ ప్రక్రియ 11.30 గంటలకు ముగిసింది.

జేఎన్‌టీయూ (ఏ)కు టైమ్స్ ర్యాంకు

అనంతపురం: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్ఈ) వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్-2025లో జేఎన్‌టీయూ (ఏ)కు ర్యాంకు దక్కింది. అంతర్జాతీయ స్థాయిలో 801–1,000 ర్యాంకు, జాతీయ స్థాయిలో 23వ ర్యాంకు దక్కించుకుంది. నాణ్యమైన బోధన, ఉత్తమ పరిశోధన, పరిశ్రమలతో అనుసంధానంతో వర్సిటీకి గణనీయమైన ర్యాంకు దక్కినట్లు జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రొఫెసర్లకు అభినందనలు తెలిపారు.

కిక్కు.. కుమ్మక్కు!



- మద్యం షాపుల టెండర్లలో 'తమ్ముళ్ల' మాయాజాలం
- పేరుకు లాటరీ...అన్నీ కూటమి నేతలకే
- అక్కడక్కడా ఇతరులకు దుకాణాలు దక్కినా కమీషన్, పర్సెంటేజీ డిమాండ్
- ప్లాన్ ప్రకారం ముందుగా సిండికేట్ అయిన అధికార పార్టీ నేతలు
- ముందస్తు ఒప్పందం ప్రకారమే లాటరీలో షాపుల ఎంపిక
- లేపాక్షి షాపు దక్కించుకున్న రంగనాథ్ అనే వ్యక్తి కిడ్నాప్

సాక్షి, పుట్టపర్తి

పేరుకు లాటరీ అంటూ అధికారులు చెబుతున్నా...జిల్లాలోని మద్యం దుకాణాలన్నీ అధికార కూటమి నేతలే దక్కించుకున్నారు. జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 షాపులకు గానూ 1,460 దరఖాస్తులు అందగా, సోమవారం ఉదయం పుట్టపర్తిలోని సాయిఆరామంలో లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. సుమారు 90 శాతం దుకాణాలు కూటమి నేతలకే దక్కాయి. అక్కడక్కడా మాత్రమే ఇతరులను అదృష్టం వరించింది. మంత్రి సత్యకుమార్‌కు సన్నిహితుడిగా ఉండే బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు ధర్మవరం నియోజకవర్గ పరిధిలో ఐదు మద్యం దుకాణాలు దక్కడం గమనార్హం. దీంతో కూటమి నేతలు సిండికేటుగా మారి దరఖాస్తులు చేశారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం, ధర్మవరం, సీకే పల్లి, కదిరి, తనకల్లు, మడకశిర ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పూర్తిగా కూటమి నేతలే మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. పెనుకొండ, పుట్టపర్తిలో మోస్తరుగా దరఖాస్తులు వచ్చినప్పటికీ.. లాటరీలో టీడీపీ నేతలే దక్కించుకోవడం విశేషం.

సంపద సృష్టి తమ్ముళ్లకేనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని చంద్రబాబు పదే పదే చెప్పారు. ప్రస్తుతం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు లాభం చేకూర్చే విధంగా మద్యం షాపులను దక్కేలా చేశారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా దరఖాస్తులను అడ్డుకున్న దాఖలాలు చాలా చోట్ల తెరపైకి వచ్చాయి. అయితే ప్రభుత్వ ఆదాయం పక్కన బెడితే.. సొంత ఆదాయం ముఖ్యమనే ధోరణిలో కూటమి నేతలు దూసుకెళ్లారు.

పర్సెంటేజీలు ఇవ్వాలని హుకుం..

కొన్ని మద్యం షాపులకు కూటమి నేతలతో పాటు ఇతరులు కూడా ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో దరఖాస్తులందరితో మాట్లాడి సిండికేటుగా మారినట్లు ఆరోపణలున్నాయి. లాటరీలో షాపు ఎవరికి దక్కినా తలా కొంచెం పంచుకోవాలనే ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. మరోవైపు షాపు నుంచి కొంత మొత్తం ప్రతి నెలా ఎమ్మెల్యే వాటాగా ఇవ్వాలని కదిరి, హిందూపురంలో ఆదేశించినట్లు సమాచారం.

రూ.10 లక్షలు ఇచ్చేస్తాం..

ధర్మవరంలో మద్యం షాపులు ఎవరికి దక్కినా తమకే ఇవ్వాలని, ఇందుకు రూ.10 లక్షలు ఇస్తామని టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ ముందుగానే షరతు విధించినట్లు తెలుస్తోంది. ఒక చోట ఆఫీసు పెట్టి.. అన్నింటినీ నిర్వహించేందుకు ప్లాన్ వేసినట్లు సమాచారం.

బాటిల్‌పై కనీసం రూ.10 అ'ధనం'..

కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సిండికేట్‌గా ఏర్పడేందుకు జోరుగా పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తోంది. ఇదేగనుక జరిగితే మద్యం షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయించినా అడిగే వారే ఉండరు. ఎంఆర్‌పీపైన కనీసం రూ.10 అధిక ధరలకు విక్రయించేలా చర్చలు జరుగుతున్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం.

బినామీలతో దరఖాస్తులు..

కొన్ని చోట్ల టీడీపీ నేతలు నేరుగా బరిలో దిగకుండా.. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న వారి పేరు మీద దరఖాస్తు చేయించారు. అలాంటి వారికి కూడా లాటరీ ద్వారా అవకాశం లభించింది. పేరుకు ఇతర ప్రాంతంలో ఉద్యోగం చేసే వ్యక్తి అయినప్పటికీ.. నిర్వహణ మొత్తం స్థానిక నేతలదే. రాప్తాడు, హిందూపురంలో ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి.

మహిళలకూ షాపులు..

కొందరు మహిళలు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేశారు. సోమవారం తీసిన లాటరీలో నలుగురు మహిళలకు మద్యం షాపులు దక్కాయి. మద్యం వ్యాపారానికి తాము దూరమని బీజేపీ చెబుతున్నా...ఆ పార్టీ నేతలు షాపులు దక్కించుకోవడం గమనార్హం. దుకాణాల కేటాయింపు పూర్తి కావడంతో బుధవారం నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుంది.

☛ మడకశిర నియోజకవర్గంలో 10 మద్యం షాపులకు 162 దరఖాస్తులు అందగా.. సోమవారం తీసిన లాటరీలో 9 మద్యం షాపులు టీడీపీ నాయకులకు దక్కాయి. మడకశిర నగర పంచాయతీ, మడకశిర రూరల్ పరిధిలో 4 మద్యం దుకాణాలుండగా.. టీడీపీ నాయకుడు వెంకటసుబ్బారెడ్డికి మడకశిర నగర పంచాయతీలోని 79వ నంబర్ దుకాణం, మడకశిర రూరల్‌లోని 80, 81 దుకాణాలు దక్కాయి. అలాగే వెంకట సుబ్బారెడ్డి భార్య వైవీ జయంతి మాలకు 78 నంబర్ దుకాణం దక్కింది. గుడిబండ మండలంలోని 2 మద్యం షాపులు టీడీపీ నాయకులు గిరేతిమ్మప్ప, చిత్తయ్యకు దక్కాయి. అమరాపురం మండలంలోని 2 మద్యం షాపులుండగా, టీడీపీ నాయకుడు మారుతిప్రసాద్ భార్య పీఎం పంకజకు 83వ నంబర్ దుకాణం, అతని కుమారుడు పీఎం సచిన్‌కు 84వ నంబర్ దుకాణం దక్కింది. అగళి మండలంలోని మద్యం షాపు టీడీపీ మాజీ సర్పంచు రవికుమార్‌కు దక్కింది. ఇలా నియోజకవర్గంలోని 10 షాపుల్లో 9 మద్యం టీడీపీ నాయకులకు లాటరీలో దక్కాయి. ధర్మవరం నియోజకవర్గంలో ఐదు షాపులు అనంతపురం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దక్కించుకున్నారు.

...ఇలా జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార కూటమి నేతలే చక్రం తిప్పారు. పేరుకు లాటరీ అని అధికారులు చెబుతున్నా..మెజార్టీ దుకాణాలు కూటమి నేతల వశం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. లాటరీ విధానంపై చూసి దరఖాస్తుదారులంతా ఇది కుమ్మక్కు రాజకీయం అంటూ నిట్టూరుస్తూ వెళ్లిపోయారు.



మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న ఆర్డీఓ సువర్ణ



లాటరీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్

లేపాక్షి షాపు కోసం కిడ్నాప్..

లేపాక్షిలోని 57వ నంబర్ దుకాణం చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్‌కు లాటరీలో దక్కింది. దీంతో టీడీపీ నేతలు అతన్ని సాయిఆరామం నుంచి కిడ్నాప్ చేసి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ ఇంటికి తీసుకువెళ్లారు. తీవ్రంగా భయాందోళనకు గురిచేశారు. దీంతో అతని భార్య అశ్విని తన భర్తను చూపించాలంటూ పుట్టపర్తి అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన ప్రసారమాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో టీడీపీ నేతలు రంగనాథ్‌తో రాయ'భేరం' కుదుర్చుకుని వదిలిపెట్టినట్లు తెలుస్తోంది.



'పురం'లో సీఐతో మాట్లాడుతున్న రంగనాథ్

ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి అతను హిందూపురం వన్‌టౌన్ స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యారు. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, కేవలం తన ఫోన్ స్విచాఫ్ రావడంతో తన భార్య ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అన్నిచోట్లా వారిదే హవా

- ధర్మవరం నియోజకవర్గంలో 80 శాతానికిపైగా దుకాణాలు కూటమి పార్టీల నాయకులకే దక్కాయి. ఆశ్చర్యకరంగా బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు 5 మద్యం దుకాణాలు దక్కడం గమనార్హం.
- రాప్తాడు నియోజకవర్గంలోని మద్యం షాపులన్ని టీడీపీ సానుభూతిపరులకే దక్కాయి. చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఐదు మద్యం షాపులుండగా, చెన్నేకొత్తపల్లి మండలంలోని రెండు షాపులను రామగిరి మండలం గాదికుంటకు చెందిన టీడీపీ నాయకులు గంగాధర్‌నాయుడు, గోపినాథ్ దక్కించుకున్నారు. కనగానపల్లి మండలంలో రెండు షాపులుండగా, టీడీపీ సానుభూతిపరుడు హరినాథ్‌కు దక్కాయి. రామగిరి మండలంలోని పేరూరు వైన్‌షాపు టీడీపీ కార్యకర్త కావేటి మహేంద్ర సొంతమైంది. వీటితోపాటు నియోజకవర్గంలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు సంబంధించి మద్యం షాపులు కూడా టీడీపీ నాయకులకే దక్కడం విశేషం.
- పుట్టపర్తి నియోజకవర్గంలో 13 మద్యం దుకాణాలకు 424 దరఖాస్తులు అందాయి. సోమవారం తీసిన లాటరీలో ఒకటి, రెండు మినహా మిగతా దుకాణాలన్నీ టీడీపీ నాయకులు, ఆ పార్టీ సానుభూతిపరులకే దక్కడం గమనార్హం.

బాలయ్యా.. ఎక్కడున్నావయ్యా?



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక

- గ్యాంగ్‌రేప్ బాధితులను పరామర్శించేందుకూ సమయం లేదా?
- పీఏలతో నియోజకవర్గాన్ని నడిపించేందుకా ప్రజలు గెలిపించింది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మండిపాటు
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది
- ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమాలకే పరిమిత కావడం బాధాకరం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

సాక్షి, పుట్టపర్తి : 'అయిన వాళ్లకు కష్టమొస్తే అరగంటలో వస్తానేమో.. ఆడదానికి కష్టమొస్తే అర క్షణంలో వస్తా' అంటూ సినిమాల్లో డైలాగులు పేల్చే నందమూరి బాలకృష్ణ.. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న హిందూపురం నియోజకవర్గంలో ఇద్దరు మహిళలపై గ్యాంగ్ రేప్ జరిగి మూడు రోజులైనా ఎందుకు స్పందించడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం ఆమె పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక తదితరులతో కలసి పుట్టపర్తిలోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులును కలిసి గ్యాంగ్ రేప్ విషయమై మాట్లాడారు. నిందితులను త్వరగా పట్టుకుని..కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సినిమా షూటింగుల్లో బిజీగా ఉంటూ.. పీఏలతో నియోజకవర్గాన్ని నడిపించేందుకా గెలిపించిందని బాలకృష్ణను నిలదీశారు. కనీసం బాధితులను పరామర్శించే సమయం లేదా అంటూ ప్రశ్నించారు.

మీకు బాధ్యత లేదా బాలకృష్ణా..?

హిందూపురం నియోజకవర్గంలో అమానుష ఘటన జరిగి మూడు రోజులైనా స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ కనీసం బాధితులకు బాసటగా నిలవలేక పోయారని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గాన్ని గాలికి వదిలి సినిమాలకు పరిమితం కావడం బాధాకరమన్నారు. ఇక్కడి ప్రజలపై ఎమ్మెల్యేగా మీకు బాధ్యత లేదా అని నిలదీశారు. హిందూపురం ప్రజలకు ఏదైనా అత్యవసరం వస్తే స్పందించడానికి ఎమ్మెల్యే అందుబాటులో ఉండడం లేదని, ఇకనైనా నియోజకవర్గ ప్రజలు ఆలోచించాలని సూచించారు. హిందూపురం నియోజకవర్గంలో ఇద్దరు మహిళలపై గ్యాంగ్ రేప్ జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఈ ప్రభుత్వం చేతగానితనమేనని విమర్శించారు. మొన్న ధర్మవరం వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లిని కిడ్నాప్ చేసి హత్య చేశారని, అంతకుముందు పుంగనూరు, నంద్యాలలో మహిళలపై అఘాయిత్యాలు వెలుగు చూశాయన్నారు. ఏ ఒక్క ఘటనలోనూ ప్రభుత్వం బాధితులకు అండగా నిలవలేకపోయిందన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- ఆత్మహత్య చేసుకున్న నాయకుడి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

పుట్టపర్తి: పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తప్పక అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా నిత్యం కార్యకర్తల సంక్షేమం గురించే ఆలోచిస్తుంటారని, ఎక్కడ, ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే ఆరా తీసి అండగా నిలుస్తున్నారన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరుకుల రామాంజనేయులు భార్య పద్మావతికి సోమవారం ఆమె పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ పంపిన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. జిల్లాలో అరాచక పాలన నడుస్తోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలల కాలంలోనే వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై భౌతిక దాడులతో పాటు ఆస్తులు ధ్వంసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దీపిక, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజనేయులు భార్య పద్మావతికి రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న ఉషశ్రీ చరణ్, శ్రీధర్‌రెడ్డి, దీపిక తదితరులు

మూడు రోజులు భారీ వర్షాలు

- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చేతన్ సూచన
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్/ప్రశాంతి నిలయం: జిల్లాలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చేతన్ సూచించారు. ముఖ్యంగా మంగళ, బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. విపత్తు సమయాల్లో ప్రజలకు సాయం అందించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటలూ పని చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలిగినా 08555–289039/939299719 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందవచ్చన్నారు. సోమవారం ఆయన పుట్టపర్తిలోని సాయిఆరామంలో విలేకరులతో మాట్లాడారు. తుపాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రెండు రోజులుగా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. శిథిల భవనాలలో నివశించే వారు వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఎవ్వరూ బయటికి రాకూడదన్నారు. వర్షాల వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్, ఆహారం, తాగునీరు, రవాణా, వైద్యం తదితర అవసరమైన సేవలను అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహాల వైపు, నీటి గుంతల వైపు వెళ్లరాదన్నారు.

పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు..

గ్రామాల్లో పైప్‌లైను లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సమత సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి..

జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో వేరుశనగ కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సూచించారు. కోతలు కోసి ఉంటే ఉత్పత్తులను టార్పాలిన్‌తో కప్పి ఉంచాలన్నారు. జిల్లాలో పశువుల, గొర్రెలు, మేకల కాపర్లు రైతులు తుపాను సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్ సూచించారు.

గర్భిణులకు ఇబ్బందులు కలగొద్దు..

భారీ వర్ష సూచన నేపథ్యంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్ ఆదేశాలు జారీ చేశారు. మండలాల వారీగా ఇప్పటికే గుర్తించిన గర్భిణీలకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా 443 మంది గర్భిణీల జాబితాను ఆయా ఆస్పత్రులకు పంపామని, వారి ప్రసవాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో జనరేటర్లు, యూపీఎస్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

రోజంతా జడివాన



తుపాను ప్రభావంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా జడి వాన కురిసింది. తలుపుల మండలంలో 16.6 మి.మీ, ఎన్‌పీకుంట 15.2 మి.మీ, నల్లచెరువు మండలంలో 14.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక తనకల్లులో 14.4 మి.మీ, గాండ్లపెంట 13.6, అమడగూరు 10, కదిరి 6.2, ఓడీసీ 5.4, నల్లమాడ 6.2, గోరంట్ల 4.2, లేపాక్షి 3.2, ధర్మవరం 2.6, బుక్కపట్నం 2.0, పుట్టపర్తి 2.2, కొత్తచెరువు 2.4, ముదిగుబ్బ 2.4, పెనుకొండ 2.4, సీకేపల్లి 1.2, సోమందేపల్లి 1.2, బత్తలపల్లి 1.8, రొళ్ల, హిందూపురం మండలాల్లో 1.8, తాడిమర్రి మండలంలో 0.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చేతన్ సూచించారు. సోమవారం ఆయన అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. గంట గంటకూ వాతావరణ శాఖ నుంచి అందిన సమాచారం తెలియజేస్తూ ప్రజలను, అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు.

క్లుప్తంగా

మామిడి మొక్కల నరికివేత

ధర్మవరం రూరల్: మండలంలోని మల్లేనిపల్లికి చెందిన రైతు పూజారి నరసింహులు తోటలోని 30 మామిడి మొక్కలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బాధిత రైతు తెలిపిన మేరకు... తనకున్న నాలుగు ఎకరాల్లో ఒక వైపు మూడు సంవత్సరాల క్రితం 30 మామిడి మొక్కలను నాటారు. మొక్కలు ఏపుగా పెరుగుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని కొడవలితో నరికి వేశారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపాడు.

యువకుడి బలవన్మరణం


శివకుమార్ (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన బుసగాని గొల్ల శివకుమార్ (17) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.... గ్రామానికి చెందిన బుసగాని గొల్ల నాగిరెడ్డి, రేణుకమ్మ దంపతులకు కుమారుడు శివకుమార్‌తో పాటు ఓ కుమార్తె ఉంది. కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో నాగిరెడ్డి మద్యానికి బానిస కావడంతో పలుమార్లు దంపతుల మధ్య గొడవలు జరిగాయి. అయినా నాగిరెడ్డిలో మార్పు రాకపోవడంతో ఏడాది క్రితం కుమార్తెను పిలుచుకుని రేణుకమ్మ తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో నాగిరెడ్డి, శివకుమార్ ఇద్దరే కలసి ఉంటున్నారు. కూలి పనులకు వెళుతున్న శివకుమార్ కూడా ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. దీంతో తండ్రీకొడుకు మధ్య పలుమార్లు గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో క్షణికావేశానికి లోనైన శివకుమార్ సోమవారం ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చీరతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భోజనానికని ఇంటికి వచ్చిన తండ్రి ఎన్నిమార్లు తట్టినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూశాడు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని గుర్తించి చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించాడు. రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్


ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రిన్సిపాల్ సంగీతకుమారి

శింగనమల: నార్పలలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలకు ఐఎస్ఓ గుర్తింపు దక్కింది. సోమవారం కలెక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి ఐఎస్ఓ(ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... దేశంలోనే మొదటిసారి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకున్న ప్రభుత్వ గురుకుల పాఠశాలగా గుర్తింపు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ధర.. గుండె దడ!

- సామాన్యుడికి అందుబాటులో లేని కాయగూరల ధరలు
- నెల రోజుల వ్యవధిలోనే ధరల రెట్టింపు
- బెంబేలెత్తిపోతున్న వినియోగదారులు
- చోద్యం చూస్తున్న సర్కార్


కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న మడకశిర వారపు సంత

కదిరి: బీన్స్, ఉల్లి, వెల్లుల్లి, పచ్చి మిర్చి ఇతర కాయగూరల ధరలు వింటే కళ్ల నుంచి నీళ్లు వచ్చేస్తున్నాయి. ఇక ఆకుకూరల ధరలు కూడా చుక్కల్ని తాకుతున్నాయి. ధరలు అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు కొనుగోలు చేయలేకపోతున్నారు.

రోజుల వ్యవధిలోనే భారీ మార్పు..

మార్కెట్‌లో కాయగూరల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. నెల రోజుల వ్యవధిలోనే ధరలు రెట్టింపు కావడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఒకవైపు నిత్యావసర ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతుంటే వాటి పక్కన కూరగాయలు వచ్చి చేరాయని సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులకు తోడు తగ్గిన కూరగాయల సాగుతో వీటి ధరలు అమాంతంగా పెరిగాయని వ్యాపారులు నమ్మబలుకుతున్నారు. కాయగూరల ధరలతో పాటు చికెన్, మటన్, చేపల ధరలూ పోటీపడ్డాయి. కిలో చికెన్ ధర రూ.300కు పైనే ఉంది. మటన్ కిలో రూ.800తో విక్రయిస్తున్నారు. ఈ రెండింటి ధరలు అందుబాటులో లేకపోవడంతో సామాన్యుల దృష్టి చేపలపై పడింది. దీంతో వీటి ధర కూడా రోజురోజుకూ మారుతోంది. ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని జనం మండిపడుతున్నారు.

దళారులకు కాసుల పంట..

మార్కెట్‌లో 15 రోజుల క్రితం కిలో రూ.30తో అమ్ముడు పోయిన పచ్చిమిర్చి ప్రస్తుతం రూ.60తో విక్రయిస్తున్నారు. ఇక క్యారెట్, బీన్స్, క్యాప్సికం, మునగ ధరలు కూడా వందకు చేరువలో ఉన్నాయి. ఉల్లి, ఆలు, చిక్కుడు, బెండ, బీర తదితర కాయగూరల ధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆకుకూరల నేలపాలవ్వడంతో రైతులకు నష్టాలు తప్పలేదు. చేతికి వచ్చిన అరకొర ఆకుకూరలు ప్రజావసరాలకు తక్కువ పడుతున్నాయి. దీంతో వీటి ధర కూడా అమాంతం కొండెక్కి కూర్చొంది. పలు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడా రహదారులు మూసుకుపోవడం కూడా కూరగాయల ధరల పెరుగుదలకు ఓ కారణంగా తెలుస్తోంది. కాస్తాకూస్తో పండిన కాయగూరలు, ఆకుకూరలను రైతులు మార్కెట్‌కు తీసుకువస్తే దళారులు ఏకమై ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత ఇష్టాను ధర పెంచేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆరుగాలం శ్రమించిన రైతులకు రెక్కల కష్టం తప్ప మరేమీ మిగలడం లేదు. దళారులకు మాత్రం కాయగూరల ధరలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

కూరగాయల ధరలు ఇలా..		
రకం	సెప్టెంబర్‌లో (కిలో)	ప్రస్తుత ధర (కిలో)
పచ్చిమిర్చి	రూ.30	రూ.60
క్యారెట్	రూ.40	రూ.80
బీన్స్	రూ.60	రూ.80
మునగ	రూ.40	రూ.90
బెండ	రూ.25	రూ.70
ఆలుగడ్డలు	రూ.35	రూ.60
వంకాయ	రూ.20	రూ.60
క్యాప్సికం	రూ.40	రూ.80

కొత్తిమీర కట్ట రూ.60..

20 రోజుల క్రితం రూ.10తో అమ్ముడు పోయిన కొత్తిమీర కట్ట ధర ఇప్పుడు రూ.60కు చేరుకుంది. కొత్తిమీర కట్ట అడుగుతూ రూ.10 చేతిలో పెడితే వ్యాపారులు అపహాస్యం చేస్తూ మాట్లాడుతున్నారు. తమకే రూ.50 పడుతోందని, రూ.10తో ఇచ్చేందుకు ఏమీ లేదంటూ ఎద్దేవా చేస్తూ వినియోగదారుల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారు. ఇంకొందరు వ్యాపారులు నవ్వుకుంటూ నాలుగు కొత్తిమీర పొసలు చేతిలో పెట్టి పోమ్మంటున్నారు.

దిగుబడులు లేవు



పంటలు సరిగా పండక దిగుబడులు లేవు. అందుకే మార్కెట్‌కు కూరగాయలు రావడం తగ్గిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి కూడా సరుకు రావడం లేదు. రవాణా చార్జీలు కూడా బాగా పెరిగిపోయాయి. అందుకే కూరగాయల ధరలు పెంచాల్సి వస్తోంది. కొన్నాళ్ల పాటు ఇదే పరిస్థితి ఉంటుంది. – నౌషాద్, కూరగాయల వ్యాపారి, కదిరి

ఏమీ కొనలేకున్నాం



నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఆకుకూరలు, నూనెలు, బియ్యం ఇలా ఏది కొనాలన్నా ధరలు మండిపోతున్నాయి. జూన్ నుంచి ఇప్పటి వరకూ ధరలు చూస్తే నెలనెలా పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ధరలు తగ్గించే ప్రయత్నం చేయడం లేదు. – శ్రీధర్‌రెడ్డి, నల్లచెరువు

ధరలు నియంత్రించాలి



మార్కెట్‌లో కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ చౌక దుకాణాల్లో కూడా ఇప్పుడు అన్ని సరుకులూ ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కష్టాలేవీ పట్టించుకోకుండా మద్యం, ఇసుక అమ్మకాల్లో మునిగిపోయింది. కూరగాయలతో పాటు నిత్యావసర సరుకుల ధరలనూ నియంత్రించాలి. – ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

విద్యార్థి మృతదేహం వెలికితీత


చంద్రశేఖరరెడ్డి (ఫైల్)

పెనుకొండ రూరల్: సరదాగా ఈత కొట్టేందుకు రిజర్వాయర్ ఇన్‌ఫ్లో వద్ద నీటిలో దిగి గల్లంతైన విద్యార్థి మృతదేహమై తేలాడు. వివరాలు... పెనుకొండ మండలం అమ్మవారిపల్లికి చెందిన చంద్రశేఖరరెడ్డి (19) అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చిన చంద్రశేఖరరెడ్డి... ఆదివారం తన స్నేహితులతో కలసి గొల్లపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాడు. కాసేపటి తర్వాత ఈత కొట్టేందుకు రిజర్వాయర్ ఇన్‌ఫ్లో వద్ద నీటిలో దిగిన ఆయన ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. స్థానికులు, పోలీసులు, కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోమవారం ఉదయం రిజర్వాయర్‌లో మృతదేహం తేలియాడడంతో పోలీసులు వెలికి తీశారు. ఘటనపై కియా ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విద్యార్థి మృతదేహానికి మంత్రి సవిత నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉద్యాన రైతులూ జాగ్రత్త : డీహెచ్ఓ

అగళి: రాగల మూడు రోజులూ బలమైన పెను గాలులతో పాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఉద్యాన పంటల రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు. అగళి మండలం ఆలూడి, కోమరేపల్లి గ్రామాల్లో ఉద్యాన పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ... మూడు రోజులు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండడంతో పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మిరప పంటను కోయకుండా ఉండాలన్నారు. ఒకవేళ ఎవరైన పంటను కోసి ఉంటే ఆరు బయట ఎండకు అరబెట్టకుండ, పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వర్షాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా నూర్‌బాషా సంఘం మహిళా అధ్యక్షురాలిగా రమీజాబీ



పుట్టపర్తి: జిల్లా నూరాబాషా (దూదేకుల) సంఘంమహిళా విభాగం అధ్యక్షురాలిగా పుట్టపర్తికి చెందిన రమీజాబీను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సోమవారం ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆ సంఘం నేతలు వెల్లడించారు.

బాలుడి ఆత్మహత్య

డి హీరేహాళ్(రాయదుర్గం): పండుగ పూట కొత్త దుస్తులు ఇప్పించలేదనే ఆక్రోశంతో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన విశాలమ్మ, నాగేంద్ర దంపతలకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు రుద్రప్ప (15) దసరా పండుగ రోజు కొత్త బట్టలు కావాలని తండ్రి వద్ద పట్టుబట్టాడు. అయితే ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇబ్బంది పడుతున్న నాగేంద్ర... తన వద్ద ప్రస్తుతానికి డబ్బు లేదని, దీపావళికి కొనిస్తానని సర్దిచెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన రుద్రప్ప ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిపోయి గొడిశెలపల్లి సమీపంలోని హెచ్చెల్సీ వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి తాను కాలువలో దూకి చనిపోతున్నట్లు తెలిపాడు. వారు ఎంత వారించినా వినకుండా నీటిలోకి దూకాడు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల పొలాల్లోని రైతులు వెంటనే కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఆ రోజు నుంచి హెచ్చెల్సీలో నీటి ప్రవాహం దిశగా గాలింపు చేపట్టారు. సోమవారం కణేకల్లు మండలం ఎర్రగుంట వద్ద మృతదేహం లభ్యమైంది. తండ్రి నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: సీపీఎం


బాధితుల పరామర్శ అనంతరం మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

హిందూపురం టౌన్: వలస కార్మిక కుటుంబ మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు సోమవారం స్థానిక జిల్లా స్పత్రికి చేరుకున్న సీపీఎం నాయకులను వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం డీఎస్పీ మహేష్ దృష్టికి వెళ్లడంతో ఆయన ముగ్గురు ప్రతినిధులను అనుమతించారు. పరామర్శ అనంతరం విలేకరులతో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి దిల్షాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై అనేక అత్యాచారాలు జరుగుతున్నా.. దోషులను శిక్షించడంలో కూటమి సర్కార్ ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, మద్యం ఏరులై పారడం, సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన వీడియోలు వైరల్ కావడం మహిళల మీద అత్యాచారాలకు కారణమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి ఉపాధి, భద్రత, రక్షణ కల్పించాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి, హిందూపురం ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు లావణ్య, శోభారాణి, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

జరుట్లరాంపురంలో చిరుత

వజ్రకరూరు: మండలం జరుట్లరాంపురం సమీపంలోని రామప్ప కొండపై సోమవారం మధ్యాహ్నం ఓ చిరుత సంచరాన్ని స్థానికులు గుర్తించి తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. వారం రోజుల క్రితం రామప్ప కొండపై నాలుగు చిరుతలు సంచరించినట్లుగా ఈ సందర్భంగా గ్రామస్తులు గుర్తు చేశారు. కాగా, కొన్ని రోజులుగా గ్రామంలోని గొర్రెలు, దూడలు, ఆవులపై చిరుత దాడి చేసిందని, ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుత సంచారాన్ని అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: స్థానిక గాంధీనగర్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని తారకరామాపురానికి చెందిన రమేష్ సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై పట్టణంలోకి వస్తుండగా గాంధీనగర్ పాత రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో రమేష్ ఎడమచేతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓ గొర్రె... 45 కిలోమీటర్లు!

గాండ్లపెంట: పట్టుమని రూ.10 వేలు విలువ కూడా చేయని గొర్రెను అపహరించి ఓ కుటుంబం చిక్కుల్లో పడింది. ఆద్యంతం సినీ ఫక్కీలో జరిగిన ఈ అపహరణలో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వివరాలు...

కోలారు జిల్లా నుంచి వస్తూ..

కర్ణాటకలోని కోలారు జిల్లా రాయపాడు గ్రామానికి చెందిన తిమ్మప్ప,.... తన కుమారుడు రాజేష్, కుమార్తె ఆశతో కారులో సోమవారం తిమ్మమ్మ మర్రిమాను సందర్శనకు బయలుదేరారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మీదుగా తిమ్మమ్మ మర్రిమానుకు ఉన్న అడ్డదారిలో ప్రయాణిస్తున్న వారు.. మార్గ మధ్యంలో తంబళ్లపల్లి మండలం ఎద్దులోళ్లకోట గ్రామం వద్ద రోడ్డు పక్కన విడిది చేసిన గొర్రెల మంద నుంచి ఓ గొర్రెను అపహరించి కారులో వేసుకున్నారు. విషయాన్ని గమనించిన కాపరి వెంటనే కేకలు వేయడంతో కారును ఆపకుండా ముందుకెళ్లిపోయారు.

45 కిలోమీటర్ల ఛేజింగ్..

గొర్రెల కాపరి కేకలు విన్న చుట్టుపక్కల కొందరు యువకులు వెంటనే అప్రమత్తమై ద్విచక్ర వాహనాల్లో కారును వెంబడించారు. ఈ క్రమంలోనే కారు వెళుతున్న మార్గంలో రెక్కమాను, గాండ్లపెంటలో తనకు తెలిసిన జీవాల వ్యాపారులకు బాధిత కాపరి ఫోన్ చేసి విషయం తెలపడంతో వారు ఆయా ప్రాంతాల్లో కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా కారును ఆపకుండా తిమ్మప్ప ముందుకు దూసుకెళ్లాడు. దీంతో దాదాపు 45 కిలోమీటర్ల మేర ఛేజింగ్ జరిగింది. చివరకు వ్యాపారుల నుంచి సమాచారం అందుకున్న గాండ్లపెంట పోలీసులు సైతం కారును ఆపే ప్రయత్నం చేయగా అక్కడ కూడా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాటర్ ట్యాంక్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం తంబళ్లపల్లి పోలీసులకు అప్పగించారు. అపహరించిన గొర్రెతో పాటు కారునూ స్వాధీనం చేశారు. నిందితులను అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంలో చొరవ చూపిన కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ కృష్ణవేణిని స్థానికులు అభినందించారు.

ప్రమాదంలో యువకుడి మృతి


భాస్కర్ (ఫైల్)

కదిరి అర్బన్: లారీని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలంలో పట్నం గ్రామానికి చెందిన భాస్కర్ (24) అనంతపురంలో పాల వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. భార్య లక్ష్మి తొమ్మిది నెలల గర్భంతో ఉంది. దీంతో ఆమెకు కుటుంబసభ్యులు సీమంతం చేయాలంటే రెండు రోజులు క్రితం స్వగ్రామానికి పిలుచుకువచ్చాడు. ఆదివారం సీమంతం జరిగింది. వేడుక అనంతరం రాత్రికి తాను ఇంటికి వస్తానని తెలిపి సోమవారం ఉదయం భార్యను అనంతపురానికి పంపాడు. స్థానికంగా పనులు చక్కబెట్టుకున్న తర్వాత రాత్రికి ద్విచక్రవాహనంపై అనంతపురానికి బయలుదేరిన భాస్కర్... పట్నం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం



వీరభద్రస్వామిని అలంకరించిన దృశ్యం, అగ్నిగుండం వద్ద భక్తుల రద్దీ

అగళి: మండలంలోని మధుడి గ్రామంలో వెలిసిన వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి అగ్నిగుండం మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా వెండి, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. జిల్లా నుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో మధుడి జనసంద్రమైంది. పురోహితులు అగ్నిగుండంలోని నిప్పును తమ జోలిలో వేయించుకుని స్వామి మూలవిరాట్ వద్దకు తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు.


అగ్ని గుండ మహోత్సవానికి హాజరైన భక్తులు

కంటైనర్‌ను ఢీకొన్న కారు





కంటెయినర్‌ను ఢీ కొని ధ్వంసమైన కారు, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు

- నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి: 44వ నంబరు జాతీయ రహదారిపై నిలిచి ఉన్న కంటెయినర్‌ను ఓ కారు వెనుక నుంచి ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం మండల పరిధిలోని 44 నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం కలబురిగి (గుల్బర్గా)కు చెందిన వీరేష్, సిద్దలింగప్ప, సంగనాథ్, హరీష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. దసరా పండుగకు స్వగ్రామం వచ్చిన వీరంతా వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలోనే వీరు ప్రయాణిస్తున్న కారు సోమవారం చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోకి రాగానే జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుక సీట్లో కూర్చున్న వీరేష్, సిద్దలింగప్ప, సంగనాథ్ తీవ్రంగా గాయపడగా, వాహనం నడుపుతున్న హరీష్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సమాచారం అందుకున్న చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను తొలుత చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు అంబులెన్స్‌లో బెంగళూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

నీటితొట్టెలో పడి బాలుడి మృతి


బబ్లూ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని భైరవానితిప్ప గ్రామానికి చెందిన వన్నూరప్ప, జ్యోత్స్న దంపతుల ఆరేళ్ల కుమారుడు కృష్ణకిషోర్ (బబ్లూ) ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి మృతి చెందాడు. సోమవారం పిల్లలంతా కలసి బీటీపీ కట్ట వద్దకు వెళ్లి ఆడుకున్న అనంతరం మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. అయితే బబ్లూ మాత్రం ఇంటికి చేరుకోలేదు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వెంకటరమణ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యుల వద్ద వివరాలు సేకరించి చుట్టుపక్కల ప్రదేశాల్లో సిబ్బందితో గాలించారు. చివరకు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న నీటి తొట్టెలో బబ్లూ మృతదేహం గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.